COMMUNIST PARTY OF INDIA (MARXIST)
Telangana State Committee
M.B.Bhavan, H. No.1-1-60/2, RTC 'X' Roads, Hyderabad -20.
Ph. 040- 27665011 /12, Fax : 27665013, Email-cpimtelangana@gmail.com

ప్రచురణార్థం/ ప్రసారార్థం: తేది. 03.03.2021

# కుబేరులకు దేశాన్ని దోచిపెడుతున్న మోడీ సర్కార్

దేశంలో పేదలు, సంపన్నుల మధ్య అంతరాలు పెరిగి సమాజానికి మరింత చేటు జరిగే పరిస్థితి దాపురించింది. ప్రస్తుతం దేశంలో 209 మంది ధనవంతులు తమ ఆస్తులను పెంచుకున్నారు. అదాని, అంబానీల ఆదాయం ఈ కొద్ది కాలంలో భారీగా పెంచుకోవడానికి నరేంద్రమోడీ ప్రభుత్వ విధానాలు తోడ్పడ్డాయి. గౌతం ఆదాని లాంటి కుబేరులు యేడాదిలోనే తమ ఆదాయాన్ని రెట్టింపు చేసుకోవడానికి కేంద్రం తోడ్పడింది. దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతూ ధనవంతులను మరింత ధనవంతులుగా, పేదలను మరింత పేదలుగా మారుస్తున్న కేంద్ర బీజేపీ ప్రభుత్వ విధానాలను సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నది.

హురున్ అంతర్జాతీయ ధనవంతుల జాబితా ప్రకారం సంపదంతా ధనికుల చేతుల్లోకి పోయే విధానాన్ని మోడీ అమలు చేసారని బట్టబయలైంది. ప్రభుత్వరంగ బ్యాంకుల వద్ద కార్పొరేట్లు లక్షల కోట్ల రుణాలు తీసుకుని ఉద్దేశ్యపూర్వకంగానే ఎగ్గొట్టి బ్యాంకులను దివాళా తీయిస్తున్నారు. వారిని మోడీ ప్రభుత్వం రక్షించుకుంటూ వస్తున్నది. కార్పొరేట్ల ప్రయోజనాల కోసం 100 ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరించి, వాటిని కారుచౌకగా తమ అనుయాయులకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నది. రాష్ట్రాల పరిధిలోని విద్యుత్ రంగాన్ని కేంద్రం ఏకపక్షంగా చట్టం చేసి, కేంద్రం స్థాయిలో రెగ్యులేటరీ ఆథారిటీని నియమించి రాష్ట్ర అధికారులను కుదించి ఫెడరల్ వ్యవస్థకు భంగం కలిగిస్తున్నది. దీంతో పెద్ద టారిఫ్ వినియోగదారులను ప్రయివేటు వారు ఆకర్షిస్తారు. తక్కువ టారిఫ్ విద్యుత్ వినియోగదారులు ప్రభుత్వ విద్యుత్ సంస్థల జాబితాలో చేరడంతో ప్రభుత్వరంగ విద్యుత్ సంస్థలు దివాళా తీస్తాయి. కార్పొరేట్లు ఇప్పటికే ఉన్న డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థను వాడుకుని కేవలం వీలింగ్ ఛార్జీలను మాత్రమే చెల్లించి, ఉద్యోగుల కుదింపు, వేతనాలు తగ్గింపుతో పాటు, రిజర్వేషన్లు అమలు కాకుండా చేసి లాభాలను మూటగట్టుకుంటారు. రాష్ట్ర ప్రభుత్వ విద్యుత్ సంస్థలను నిర్వీర్యం చేయడంతో, రాష్ట్రాలు భవిష్యత్‌లో ఉచిత విద్యుత్ ఇవ్వలేని స్థితికి చేరుకుంటాయి. కేంద్ర ప్రభుత్వ విధానాలు దేశంలోని పేద, సామాన్య ప్రజలకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి.

ఈ నేపథ్యంలో పేదలు, సంపన్నుల మధ్య అంతరాలకు కారణమవుతున్న మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు పోరాటాల్లోకి రావాలని, ప్రభుత్వరంగాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడుకోవడానికి సిద్ధం కావాలని సీపీఐ(ఎం) కోరుతున్నది.

(తమ్మినేని వీరభద్రం)
రాష్ట్ర కార్యదర్శి